క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: వైశాఖ శుద్ధ సప్తమి కావడంతో పంచారామ క్షేత్రంలోసోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి, అమ్మవారికి, ఉపాలయాల్లోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి భక్తులు బారులు తీరారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్ గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

జోరుగా శివాలయం నిర్మాణం


గొంచాలలో శివాలయ నిర్మాణ పనులు

సామర్లకోట: మండలంలోని గొంచాల గ్రామంలో శివాలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో రామాలయాలతో వివిధ దేవతామూర్తుల ఆలయాలు ఉన్నాయి. శివాలయం లేకపోవడంతో ఆలయం నిర్మాణం చేయాలని గ్రామస్తులు సంకల్పించారు. ఈ మేరకు దాతల సహకారంలో గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ ఆలయం వద్ద శివాలయం నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి సుమారు రూ.కోటి ఖర్చయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. దాతలు ముందుకొచ్చి మెటీరియల్‌కు సహకరించాలని కోరారు. దాతలు ఇచ్చిన విరాళాలకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సోమవారం శివుని దర్శనానికి సామర్లకోట రావాల్సి వస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు మాజీ సర్పంచ్ ముమ్మిడి వెంకటేశ్వరరావు తెలిపారు.

మాదిగ సంక్షేమానికి ప్రాధాన్యం


రాజాను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సామర్లకోట: సమాజంలో మాదిగల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా అన్నారు. స్థానిక పెన్షన్ లైన్‌కు వచ్చిన ఆయనను మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లూరి నాని ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సత్కరించారు. ప్రభుత్వం నుంచి మాదిగలకు అధిక నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని రాజా హామీ ఇచ్చారు.

22న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి బ్రౌన్‌పేట, మున్సిపల్ కార్యాలయం, గాంధీ చౌక్, స్టేషన్‌సెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా పెద్దాపురం పురవీధుల మీదుగా మోటారు సైకిలు ర్యాలీ కొనసాగుతుందన్నారు. భక్తులు ఈ శోభాయాత్ర మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్, చేయూత సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చేయూత హాస్టల్‌లో ఉచితంగా విద్యనభ్యసించడానికి పిల్లల నుంచి ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అధ్యక్షులు మొండి రవికుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఏ ప్రాంతం వారైనా ఈ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. అనాథ, నిరుపేద పిల్లలకు చదువును చేరువ చేయాలన్న ప్రధానాశయంతో ఉచితంగా విద్య, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం, తల్లిని కోల్పోయిన వారికి రెండో ప్రాధాన్యం, తండ్రిని కోల్పోయిన వారికి మూడో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తులు పంపేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తల్లిదండ్రుల్లో మరణించిన వారి ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు. ఇతర వివరాలకు 86397 27476 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

పగలకుండ చేయాల్సిందే..

- కుండల తయారీతో జీవనోపాధి
- బిర్యానీ సెంటర్లు, కల్లు సీజన్లతో ఊతం
- కరోనా తర్వాత వ్యాపారానికి జీవం


మట్టి కుండ తయారు చేస్తున్న కుమ్మరి


పిఠాపురం: కుమ్మరి చేతిలో రూపుదిద్దుకున్న మట్టి కుండ పేదవాడి ఫ్రిజ్‌గా చెబుతుంటారు. మట్టి కుండలో మజ్జిగ తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిదన్న విషయం పక్కకు పోగా.. తాజాగా మట్టి కుండలో బిర్యానీకి మాత్రం గిరాకీ పెరిగింది. ఏదో విధంగా కుమ్మర్లకు చేతినిండా పని దొరుకుతోంది. పూర్వం మట్టి కుండ లేని ఇల్లు ఉండేది కాదు. కాలం మారి మట్టి కుండలు మూలన పడ్డాయి. గతంలో ఎప్పుడో పెళ్లిళ్లు, కల్లు సీజన్‌లో మాత్రమే మట్టి కుండలు కనిపించేవి. ఏడాదికి ఓసారి సీజన్ వస్తుంది. వారి జీవన విధానం వృత్తి నిర్వహణ మాత్రం నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. ఏమరుపాటుగా పనిచేస్తే చేసిన పనికి చిల్లుపడుతుంది.

కరోనా రాకతో..

ఇలాఉండగా కరోనా రాకతో మళ్లీ మట్టి కుండలకు కొంత వరకు జీవం వచ్చింది. ప్రస్తుతం వేసవి ఎండల నేపథ్యంలో కుండల తయారీదార్ల జీవనయానం నిరాటంకంగా కొనసాగుతోంది. పూర్వం మంచినీరు పోసుకోవడానికి, ఇతర అవసరాలకు మట్టి కుండలనే వాడేవారు. కానీ సిల్వర్, ఇత్తడి, ఎలక్ట్రికల్ పరికరాలు అందుబాటులోకి రావడంతో రానురాను వీటి వినియోగం తగ్గిపోయింది. కల్లుగీతకు మాత్రం వీటినే ఉపయోగించడం వల్ల వేసవిలో వీటికి గిరాకీ పెరిగింది.

కుండల తయారీ

జిగురుగా ఉండే మట్టిని తెచ్చి, గుట్టగా పోసి, నిల్వ చేస్తారు. ఆ మట్టిని మెత్తగా ఉండలుగా చేసి, వాటితో కుండలు తయారుచేస్తారు. వాటిని ఎండబెట్టి, ప్రత్యేకంగా తయారు చేసిన కొలిమిలో కాల్చడం ద్వారా గట్టిగా ఉండేలా కుండలను తయారు చేయడం కుమ్మర్ల జీవన విధానం. ప్రస్తుతం కుమ్మర్లు కేవలం కల్లుకుండలను మాత్రమే తయారు చేస్తున్నారు. అప్పుడప్పుడు పెళ్లిళ్లకు అరివేడి కోసం కుండలు రూపొందిస్తున్నారు. మట్టి కుండలు ప్రస్తుతం కట్ట (ఆరు కుండలు ఉంటాయి) ధర రూ.850 నుంచి రూ.వెయ్యి పలుకుతున్నాయి. గీత కార్మికులు ఒక్కో చెట్టుకు 8 నుంచి 14 వరకు కుండలు కడతారు. ఇలా ఒక్కో సీజన్‌లో ఒక్కో గీత కార్మికుడు 200 నుంచి 350 వరకు కుండలు కొనుగోలు చేస్తారు. దీంతో కుమ్మర్లకు ఈ సీజన్‌లో చేతి నిండా పని దొరుకుతుంది. ప్రస్తుతం వేసవి కావడంతో కులవృత్తులను జోరుగా సాగిస్తున్నారు.


మట్టి కుండలో బిర్యానీ


మట్టి కుండ తయారీలో నిమగ్నమైన కుమ్మరి


తయారైన మట్టి కుండలు

ప్రభుత్వ సహకారం లేదు



మా కుల వృత్తికి ప్రభుత్వ సహకారం లేదు. గతంలో ప్రభుత్వం చేయూతనిచ్చేది ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా తాతల కాలం నుంచి ఇదే వృత్తిలో ఉండడం వల్ల దీనినే నమ్ముకుని జీవిస్తున్నాం. మా కులం వాళ్లు ఈ వృత్తిని వదిలేసి ఇతర వ్యాపారాలు చేసుకుంటున్నారు. కరోనా తరువాత వ్యాపారం కొంత పెరిగింది. చాలా మంది మట్టి కుండలు అడుగుతున్నారు. ఎక్కువగా బిర్యానీల తయారీకి చిన్న కుండల ఆర్డర్లు వస్తున్నాయి. ఇదే మా కడుపు నింపుతోంది. పని భారం పెరిగింది. ఆదాయం అంతంతమాత్రమే ఉంటుంది. పెళ్లిళ్లు, కల్లు సీజన్లలో మాకు ఎక్కువ పని ఉంటుంది. ఇతర సమయాల్లో పెద్దగా పని ఉండదు. మా తరువాత తరం ఈ వృత్తిని కొనసాగిస్తారనే నమ్మకం లేదు. బతికున్నంత కాలం ఈ వృత్తిని వదిలేది లేదు.

– కేశనకుర్తి అప్పారావు, కుమ్మరి, చెందుర్తి, గొల్లప్రోలు మండలం

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి


అర్జీ స్వీకరిస్తున్న పీడీ చైత్రవర్షిణి


పీజీఆర్‌ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ

పిఠాపురం: ప్రతి వారం పిఠాపురంలో నిర్వహిస్తున్న గ్రీవెన్సులో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని పాడా(పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) పీడీ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆమె పిఠాపురం, పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీజీఆర్‌ఎస్‌లో వివిధ అంశాలపై 49 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ 13, మున్సిపాలిటీ 25, ఇతర అర్జీలు 11 వచ్చాయని తెలిపారు. ఆయా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంతమాధవి, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో వివిధ మండలాల నుంచి సోమవారం ఆరు అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం ఏఓ మాధవరావు విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ ఏఈ రవిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం రైతుల ధర్నా



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: రైతు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లో సోమవారం రైతుకూలీలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లూరి రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరాంజనేయులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రైతులు ఆరుగాలం శ్రమించినా గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలో ఏడాది 200 రోజుల పని కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.సురేష్, వెల్లే సత్తిబాబు, స్త్రీ విముక్తి నాయకులు రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, సుందరెడ్డి రాజు, సుంకర శ్రీను, పెరుమాళ్ల శ్రీను, బాబురావు, పిల్లి దుర్గాప్రసాద్, కోట ఈశ్వరరావు, కోట్టేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శేషబాబ్జీ


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శేషబాబ్జీ మాట్లాడుతూ, ఎన్నో కార్మిక పోరాటాలకు మార్గదర్శిగా నిలిచిన సుందరయ్య అడుగు జాడల్లో ప్రతి కార్మికుడు నడుచుకోవాలన్నారు. అన్ని రంగాల కార్మికులను సంఘటితపరిచి, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, నాయకులు చల్లా విశ్వనాథం, సిరిపురపు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, దాడి బేబీ, నెక్కల నరసింహమూర్తి, మహాపాత్రిన రాంబాబు, సత్యవతి, అప్పన్న, మరిడయ్య, కరణం గోవిందు, ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం

- ఆలయ ఆదాయానికి గండికొడితే సహించం
- దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర


వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పెద్దాపురం: ఎల్లప్పుడూ దేవదాయ శాఖ రైతాంగానికి అండగా ఉంటుందని, ఎవరైనా ఆలయ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నాలు చేస్తే సహించబోమని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర అన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ భూముల వేలంపాటలు సోమవారం ఈఓ పి.సాయి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత రైతులు ఇరువర్గాలుగా ఏర్పడి వేలంపాటకు సిద్ధపడ్డారు. సుమారు ఆరు ఎకరాల భూమిని మూడేళ్ల కాల పరిమితికి గాను ఏడాదికి రూ.2.50 లక్షల వరకు వేలంపాటను కొనసాగించారు. కాగా రైతు కూలీ సంఘం నాయకుడు కర్నాకుల వీరాంజనేయులు జోక్యం చేసుకుని, దీనివల్ల రైతాంగం పూర్తిగా ఇబ్బందులు పడుతుందని, వారి నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని పాటను వాయిదా వేయాలని కోరారు. వేలంపాట మధ్యలో ఉండగా వాయిదా కుదరదని దేవదాయ శాఖాధికారులు స్పష్టం చేశారు. అయితే రైతుల పక్షాన నిలబడిన రైతు కూలీ సంఘ నాయకులు ఎకరాకు రూ.24 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది పద్ధతి కాదని, వేలంపాటలో ఎకరా రూ.40 వేల వరకు పాడిన రైతాంగాన్ని మభ్యపెట్టి, ఆలయ ఆదాయానికి గండి కొట్టడం సరికాదంటూ వేలంపాటను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. రైతులు ఎప్పుడూ నష్ట పోకూడదనే దేవదాయ శాఖ చూస్తుందని, కానీ కొంతమంది ఆలయ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేయడం సరికాదని దేవదాయ శాఖాధికారులు పేర్కొన్నారు. మళ్లీ వేలంపాటలు నిర్వహించేందుకు తేదీని ఖరారు చేసి ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు ప్రయోజనం


విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాజు

పెద్దాపురం: పుస్తక పఠనం ద్వారా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పరిజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం పుస్తక పఠనం, కథలు చదవడాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హైందవ పరిరక్షణ అందరి బాధ్యత

బోట్‌క్లబ్: సమాజంలో హైందవ పరిరక్షణ అందరి బాధ్యత అని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రపాలెం గోశాలలో సోమవారం ఉచిత ఉపనయన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షులు గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ మాట్లాడుతూ ఉచితంగా ఉపనయన కార్యక్రమం నిర్వహించడం అశ్వమేధ వంటి యాగాలు చేసిన పుణ్యం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చిన్న వయస్సులోనే ఉపనయనాది సంస్కారాలు తమ పిల్లలకు జరిపించాలన్నారు. తద్వారా హిందూ ధర్మం, మత గొప్పతనం, మంత్ర బలం పిల్లలకు తెలియజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఆహారపు అలవాట్లతో వ్యాధులు

బోట్‌క్లబ్: ప్రస్తుత ఆహారపు అలవాట్ల కారణంగా వ్యాధులు సంక్రమిస్తున్నాయని ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణుడు ఆకుల వెంకన్నబాబు అన్నారు. స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో సోమవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఐబీడీ (ఇన్‌ఫ్లోమేటరీ బౌల్ డిసీజెస్) దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకప్పుడు పాశ్చాత్య వ్యాధిగా పరిగణించబడిన ఐబీడీ ప్రస్తుతం మన దేశంలో ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా పరిణమించిందన్నారు.

వర్షం కురిసి.. ఊరటనిచ్చి..

బోట్‌క్లబ్ (కాకినాడ): మూడు వారాలుగా ఉక్కపోత, వేడిగాలులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు సోమవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం వరకూ పడిన వర్షపు జల్లులతో సేదతీరారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ వేడి గాలులతో సతమతమైన ప్రజలకు వర్షం కాస్త ఊరటనిచ్చింది. ప్రజలు వర్షపు జల్లులకు ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడ నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పలు దఫాలుగా వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో ప్రజలకు వేడి గాలుల నుంచి కాస్త ఉపశమనం లభించింది. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కాకుండానే వర్షం కురవడంతో మున్ముందు వేసవి తీవ్రత తగ్గుతుందని ప్రజలు భావిస్తున్నారు.


కాకినాడ నగరంలో కురుస్తున్న వర్షం

కుంభవృష్టితో అన్నదాతకు గుబులు



సామర్లకోటలో కురిసిన వర్షం


బరకాలు కప్పి ఉన్న ధాన్యం రాశులు

- ఎక్కడి ధాన్యం అక్కడే..
- పట్టించుకోని యంత్రాంగం


తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి కుంభవృష్టి కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సంపెంగతోట, భాస్కర్‌నగర్, సాయినగర్, సీతారామ కాలనీలు చెరువులుగా మారాయి. ఎడతెరిపి లేని వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ధాన్యం కోతలు పూర్తి కావడంతో, రాశులు ఎక్కడికక్కడే ఉండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరి కోతలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతుల వద్ద ధాన్యం పొలాల్లోను, గట్ల వద్ద ఉండిపోయింది. ధాన్యం రాశులను కప్పడానికి బరకాలు కూడా లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైసు మిల్లులకు రోజుకు టార్గెట్ ఇవ్వడం వలన అది పూర్తయిందనే సాకుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యంలో తేమ శాతం ఉందని, పొల్లు ఉందని మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీకే రాయపురం గ్రామానికి చెందిన తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, జి.మేడపాడుకు చెందిన మోరంపూడి రమేష్, పీబీ దేవం గ్రామానికి చెందిన మలకల సూరిబాబు, మలకల వరహాలబాబు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేకపోవడంతో దళారులకు విక్రయించి బస్తాకు రూ.200 నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. వర్షాలకు ధాన్యాన్ని తరుచూ ఆరబెట్టడానికి ఎకరానికి రూ.నాలుగు వేలు కూలీ అదనంగా అవుతుందని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుంచి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తే, వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు ఉండేవి కావంటున్నారు. గత ప్రభుత్వ హయాంతో రైతుల నుంచి తడిచిన ధాన్యం కూడా వెంటనే కొనుగోలు చేసిన సంఘటనలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

తప్పుడు ప్రచారంపై జర్నలిస్టుల ఆందోళన

పిఠాపురం: ప్రజాశక్తి జిల్లా విలేకరి ముమ్మిడి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తప్పుడు ఆరోపణలతో సోషల్ మీడియాలో ప్రచారం జరగడంపై సోమవారం పిఠాపురంలో జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. విలేకరి లక్ష్మణ్‌ను నకిలీ విలేకరి అని, అతడిని పోలీసులు అరెస్టు చేశారని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేశారు. దీనిపై ఆందోళనకు దిగిన జర్నలిస్టులు.. ఉద్దేశపూర్వకంగానే కొందరు నకిలీ ఐడీలతో సోషల్ మీడియా అకౌంట్లు సృష్టించి, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇలా జర్నలిస్టులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం సర్కిల్ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించిన జర్నలిస్టులు అనంతరం పోలీసులకు ఫిర్యాదు అందించారు. అలాగే కాకినాడలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. విలేకరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తప్పుడు ఆరోపణలతో సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ డిమాండ్ చేశారు.



పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న జర్నలిస్టులు